సాక్షి
మంచిర్యాల

బుధవారం ׀ 20 ׀ ఆగస్టు ׀ 2025



గట్టు మల్లన్న గుట్టపై గిరిప్రదక్షిణ

జైపూర్: వేలాల గట్టు మల్లన్నస్వామి సన్నిధిలో మంగళవారం 11వ గిరి ప్రదక్షిణ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



యూరియా కోసం నిరీక్షణ

తాండూర్: యూరియా కోసం తాండూర్ పీఏసీఎస్ ఎదుట మంగళవారం రైతులు గంటల తరబడి నిల్చున్నారు. అధికారులు ఒక్కొక్కరికి రెండు చొప్పున 440 బస్తాలు పంపిణీ చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0 /26.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సిబ్బంది

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో వారంరోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి 08736-250501 నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. 24గంటలు పని చేసే కంట్రోల్‌రూమ్‌లో అధికారులు అందుబాటులో ఉండి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. తమ కాలనీలోకి వరదనీరు చేరుతోందని.. కల్వర్టు జామ్ అయి వీధుల్లోకి నీరు వస్తోందని.. ప్రమాదకరంగా వరద ప్రవహిస్తోందంటూ ఫిర్యాదులు వస్తుండడంతో రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. వెంటనే సంబంధిత తహసీల్దార్, గ్రామపంచాయతీ, మున్సిపల్ సిబ్బందికి తెలియపరుస్తూ అప్రమత్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. అలాగే అవసరమైన సమయంలో వాగులు, నది, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి అత్యవసర సేవలందించేందుకు 90మంది సభ్యులతో కూడిన మూడు ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలను రక్షణ పరికరాలతో సిద్ధంగా ఉంచారు.

వాలీబాల్‌లో జిల్లా జట్టు ప్రతిభ



మంచిర్యాల జట్టు క్రీడాకారులు

మంచిర్యాలఅర్బన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం గురుకుల విద్యాపీఠ్‌లో రెండ్రోజులపాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్-15 విభాగంలో మంచిర్యాల జట్టు తృతీయస్థానంలో నిలిచింది. 33 జిల్లాల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో వనపర్తిపై మంచిర్యాల పైచేయి సాధించి తృతీయస్థానంలో నిలిచిందని ఎస్జీఎఫ్ కార్యదర్శి ఎండీ యాకూబ్ తెలిపారు.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

నస్పూర్: పెండింగ్ కేసులు పరిష్కరించాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రిసెప్షన్ కౌంటర్ డైలీ రిపోర్ట్ రిజిస్టర్‌ను పరిశీలించారు. రోజువారీగా వచ్చే ఫిర్యాదులపై ఆరా తీశారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాశ్, సీఐ అశోక్, ఎస్సై ఉపేందర్, సిబ్బంది ఉన్నారు.

జిల్లాలో 37 మి.మీ వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో మంగళవారం 37.8 మిల్లి మీటర్ల వర్షం కురిసింది. జన్నారం మండలంలో 39.4 మిల్లి మీటర్లు, దండేపల్లిలో 6.4, లక్సెట్టిపేటలో 45.4, హాజీపూర్‌లో 59.8, కాసిపేటలో 52.6, తాండూర్‌లో 29.2, భీమినిలో 25.2, కన్నెపెల్లిలో 21.4, వేమనపల్లిలో 27.8, నెన్నెలలో 21.6, బెల్లంపల్లిలో 62.2, మందమర్రిలో 39.2, మంచిర్యాలలో 82.4, నస్పూర్‌లో 68.2, జైపూర్‌లో 22.4, భీమారంలో 15.3, చెన్నూర్‌లో 21.4, కోటపల్లిలో 25.4 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది.

వ్యాధుల వివరాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న ఎస్‌ఎంవో డాక్టర్ అతుల్

మంచిర్యాలటౌన్: జిల్లాలో నమోదవుతున్న విజల్స్ రూబెల్లా, డిఫ్తీరియా, పెరిటిసిస్, న్యూమెంటల్ టిటానస్, ఏఎఫ్‌పీ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఎస్‌ఎంవో డాక్టర్ అతుల్ సూచించారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం జిల్లా వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. వ్యాధి నిర్ధారణకు తప్పనిసరిగా శాంపిళ్లు సేకరించాలని, ప్రైవేట్, ప్రభుత్వ వైద్యులకు వీటిపై అవగాహన కల్పించాలని, రోగాలకు సంబంధించిన వివరాలు నమోదు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్‌కు జిల్లా సర్వైలెన్స్ అధికారిగా బాధ్యతలు అప్పగించారు. ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, బెల్లంపల్లి డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, డీపీహెచ్ పద్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, హెల్త్ ఆఫీసర్ సుమన్, జిల్లా మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్ పాల్గొన్నారు.



మంచిర్యాలలో ఏసీసీ ఎదుట నాలాలోని పూడికను జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది (ఫైల్)

పట్టణాల్లో పరేషాన్

- వానొస్తే ముంపు ముప్పు
- కబ్జాకు గురైన కాలువలు
- నామరూపాల్లేని నాలాలు
- పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు
- బల్దియాలకు వరదగండం
- జనాలకు తప్పని తిప్పలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: చినుకు పడితే జిల్లాలోని ఆయా పట్టణాల్లో అనేక కాలనీలు ముంపు బారిన పడుతున్నాయి. మంచిర్యాల కార్పొరేషన్, బెల్లంపల్లి, మందమర్రి, చెన్నూర్, క్యాతనపల్లి, లక్సెట్టిపేట మున్సిపాల్టీలకు ముప్పు తప్పడంలేదు. ఒకట్రెండు రోజులు వర్షాలు కురిస్తేనే వరద చుట్టుముడుతోంది. రోడ్లపైకి, ఇళ్లలోకి నీరు వస్తోంది. కల్వర్టులు, కాలువలు, నాలాలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు, కుంటలు, వాగుల సమీప నివాసాలవారి పరిస్థితి చెప్పనక్కరలేదు. ఏళ్లుగా వరద ప్రభావిత ప్రాంతాలవాసులు ఇవే కష్టాలెదుర్కొంటున్నారు.



లక్సెట్టిపేటలో ఇంటి చుట్టూ చేరిన నీరు (ఫైల్)

అధ్వానంగా నిర్వహణ

పాతమున్సిపాలిటీలైన బెల్లంపల్లి, మంచిర్యాల, మందమర్రి పట్టణాలతోపాటు ఇటీవల కార్పొరేషన్‌లో విలీనమైన నస్పూర్‌తో సహా చెన్నూరు, లక్సెట్టిపేట, క్యాతనపల్లి పట్టణాలు ఏళ్లుగా ముంపు సమస్య ఎదుర్కొంటున్నాయి. ఏళ్ల క్రితం నిర్మించిన కాలువలు, కల్వర్టులను విస్తరించకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోంది. ఎక్కడికక్కడ కబ్జాలూ పెరిగిపోయాయి. వరద కాలువలు, మురుగు కాలువల్లోని పూడిక తొలగించకపోవడంతో పొంగి పొర్లుతున్నాయి. చాలాచోట్ల ప్లాస్టిక్ వ్యర్థాలు, రోజువారీగా కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించడం లేదు. ఇక వేసవిలోనే వానాకాలంలో ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలు కూడా నామమాత్రంగా ఉన్నాయి. దీంతో 100 రోజుల ప్రణాళికలోనూ సమస్యలు పరిష్కారం కావడం లేదు.


వానొస్తే వరద కష్టాలే..

- జిల్లా కేంద్రంలోని బృందావనం కాలనీ, సూర్యనగర్, చున్నంబట్టివాడ, హమాలీవాడ అధికంగా వరదముప్పు ఎదుర్కొంటున్నాయి. ఇక్కడ సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. పోచమ్మ చెరువు మత్తడి కాలువ కబ్జాకు గురైంది. హమాలీవాడ వైపు వెళ్లే రెండు రైల్వే అండర్ బ్రిడ్జిల వరదనీరు కూడా రోడ్లపైకి వస్తోంది. హమాలీవాడలో వర్షపు నీటితో కాలనీ మునిగి వరదనీరు ఇళ్లలోకి చేరుతోంది. హైటెక్‌సిటీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వర్షపునీరు రోడ్లపైనే నిలుస్తోంది. ఏసీసీ, రాళ్లవాగు, తోళ్లవాగు ఇరువైపులా ఉన్న కాలనీలూ వరద ముప్పు ఎదుర్కొంటున్నాయి. వాగుల వరకు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోంది. ఇటీవల మున్సిపాలిటీల్లో 100 రోజుల ప్రణాళిక అంటూ హడావుడి చేసినప్పటికీ పూర్తి స్థాయిలో కార్యాచరణ లేదు. దీంతో చినుకుపడితే రోడ్లు చిత్తడి అవుతున్నాయి.
- క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో కాకతీయ కాలనీ, విద్యానగర్, హనుమాన్‌నగర్‌లో ఏటా వానాకాలంలో ఇళ్లలోకి వరదనీరు చేరుతోంది. పాత కల్వర్టుల స్థానంలో కొత్తవి నిర్మించాల్సి ఉంది. మరోవైపు సింగరేణి నిర్వహణలో ఉండి అటు కంపెనీ, ఇటు మున్సిపల్ అధికారులు పట్టించుకోక సమస్య పరిష్కారం కావడంలేదు.
- లక్సెట్టిపేట పట్టణంలో 5, 7, 9, 12 వార్డుల్లో డ్రైనేజీ సౌకర్యం లేక వరదనీరు ఇళ్లలోకి చేరుతోంది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు తొమ్మిదో వార్డుకు చెందిన దర్శనాల శ్రీనివాస్ ఇంటిలోకి నీరు చేరింది. ఇంట్లోని నిత్యావసరాలు నీటిలో తడిచిపోవడంతో బాధిత కుటుంబీకులు అవస్థలు పడ్డారు.
- మందమర్రిలో విద్యానగర్, చెంచుకాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీలు, రెండో జోన్‌లోని సింగరేణి క్వార్టర్లలో వరద ఇళ్లలోకి చేరుతోంది. ఇక్కడ రోడ్డు ఎత్తుగా ఉండి, క్వార్టర్లు కిందికి ఉండడంతో ఈ పరిస్థితి ఎదురవుతోంది. చాలాచోట్ల కాలనీల్లో కాలువలు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు.
- చెన్నూరు పరిధిలో మేదరవాడ, లైన్‌గడ్డ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతోంది. రెండు కాలనీల్లో డ్రైనేజీ పనులు చేపట్టి వరద ముప్పు తప్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.
- బెల్లంపల్లి పట్టణంలో రామ్‌నగర్ బస్తీ వంతెన పైనుంచి వరద వెళ్తూ అటు వైపు రాకపోకలు నిలిచిపోతున్నాయి. 12వ వార్డులోని రైల్వే ఆఫీస్, ఫ్లైఓవర్ పరిసర ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతోంది. లోతట్టు ప్రాంతాలవారు ఇబ్బంది పడాల్సి వస్తోంది. సింగరేణి కాలనీలున్న చోట ఇబ్బందులు తప్పడం లేదు. కంపెనీ క్వార్టర్లు, ఆఫీసులున్న చోట నిర్వహణ సరిగా లేక రోడ్లపైకి వరదనీరు వస్తోంది.

ఆస్తి పన్ను ఎగవేత?

- ఓసీపీ కాంట్రాక్ట్ కంపెనీల నిర్వాకం
- బల్దియాకు రూ.లక్షల్లో బకాయిలు
- ఆర్‌ఆర్ యాక్ట్ ప్రయోగిస్తున్నా అంతే..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: శ్రీరాంపూర్ ఓసీపీ కంపెనీలో ఓబీ (ఓవర్ బర్డెన్) మట్టి వెలికితీత పనులు చేపడుతున్న కాంట్రాక్ట్ సంస్థలు స్థానిక మున్సిపాలిటీకీ మాత్రం పన్ను చెల్లించడంలో అలసత్వం వహిస్తున్నాయి. అధికారులు పలుసార్లు నోటీసులిస్తున్నా పట్టించుకోకపోవడంతో రూ.లక్షల్లో పన్నుల బకాయిలు పేరుకుపోయాయి. ఇప్పటివరకు రూ.58.50లక్షల వరకు స్థానిక సంస్థకు పన్ను చెల్లించాల్సి ఉంది. అయితే సామాన్య పౌరుల ఇంటి పన్ను చెల్లించడంలో జాప్యం జరిగితే వెంటనే చర్యలు చేపట్టే అధికారులు బడా సంస్థలపై ఇప్పటివరకు కఠినచర్యలు తీసుకోవడం లేదు. నస్పూర్ మున్సిపాలిటీగా ఉన్నపుడు నోటీసులిస్తూ సరిపెట్టారు. చివరకు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో చర్యలు ప్రారంభించారు. అయితే మున్సిపల్ అధికారులు బకాయిలు వసూలు చేయలేకపోతున్నారు. ప్రస్తుతం కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ ఉండడంతో ఆయన చర్యలు తీసుకుంటున్నారు. అయితే కంపెనీల నుంచి స్పందన లేదు. చివరకు రెవెన్యూ రికవరీ (ఆర్ఆర్) యాక్ట్ కింద ఆస్తుల స్వాధీనానికి కూడా ఆదేశాలిచ్చారు. అయితే ఆర్‌అండ్‌బీ అధికారులను భవన నిర్మాణాల క్యాంపు మదింపు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. కానీ, నాలుగు నెలలుగా ఆ కంపెనీ క్యాంపు నిర్మాణాల విలువ లెక్కగట్టి నివేదిక ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు. మరోవైపు ఆయా కంపెనీల స్థిరాస్తులతో పాటు చరాస్తులైన వాహనాలనూ ఆర్‌ఆర్ యాక్ట్ కింద రికవరీ చేస్తే కార్పొరేషన్‌కు ఆదాయం వచ్చే అవకాశముంది.



రూ.లక్షల్లో పన్ను బకాయిలు

జీవీఆర్ ఇన్‌ఫ్రా, సీఆర్‌ఆర్ క్యాంపు, గౌరవ్ కంపెనీలు గత కొన్నేళ్లుగా స్థానిక మున్సిపాలిటీకి ఆస్తి పన్ను చెల్లించడం లేదు. గతంలో నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నప్పుడు అప్పటి అధికారులకు ఈ మూడు కంపెనీలకు డిమాండ్ నోటీసులిచ్చారు. ఆ తర్వాత పలుసార్లు హెచ్చరిస్తూ నోటీసులు కూడా ఇచ్చారు. అయినప్పటికీ స్పందించ లేదు. 2022నుంచే ఆస్తిపన్ను బకాయిలున్నాయి. రెండు సంస్థలు మూడేళ్ల పన్ను చెల్లించాల్సి ఉండగా, జీవీఆర్ మాత్రం రెండేళ్ల ఆస్తి పన్ను చెల్లించాలి. వీటిలో అత్యధికంగా గౌరవ్ కంపెనీ రూ.21.92లక్షలు, సీఆర్‌ఆర్ రూ.18.48లక్షలు, జీవీఆర్ కంపెనీ రూ.18.10లక్షలు చెల్లించాలని నోటీసులో అధికారులు పేర్కొన్నారు. ఇందులో గౌరవ్ కంపెనీ ఇప్పటికే కాంట్రాక్ట్ ముగిసిపోయింది. గత మూడేళ్లుగా కంపెనీలకు నోటీసులిస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం మిగతా రెండు కంపెనీలే పనులు నిర్వర్తిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ పన్ను చెల్లించాల్సి ఉంది. మరోవైపు సింగరేణి కంపెనీ నుంచి పనుల బిల్లుల చెల్లించే సమయంలోనైనా బకాయిలు వసూలు చేసుకునే అవకాశాన్ని పరిశీలిస్తే స్థానిక సంస్థకు ఆదాయం సమకూరనుంది.

స్తంభాలపై కేబుల్ తొలగించాలి

చెన్నూర్: జిల్లాలోని విద్యుత్ స్తంభాలకు అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన కేబుల్‌ను వెంటనే తొలగించాలని ఎస్ఈ జాడే ఉత్తమ్ పేర్కొన్నారు. గణేశ్ నవరాత్రోత్సవాల్లో ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు చెన్నూర్ మున్సి పాలిటీ పరిధిలో పర్యటించారు. స్తంభాలకు అమర్చిన కేబుల్‌ను పరిశీలించారు. అనంతరం స్థానిక విద్యుత్ సబ్ డివిజనల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 27నుంచి గణేశ్ నవరాత్రోత్సవాలు ప్రారంభమవుతాయని, నిర్వాహకులు విద్యుత్ తీగల కింద మండపాలు ఏర్పాటు చేయవద్దని తెలిపారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు విద్యుత్ అధికారులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని తెలిపారు. మండపాల కోసం నాణ్యమైన తీగలు వినియోగించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా స్తంభాలపై ఏర్పాటు చేసిన కేబుల్‌ను సంనిర్వాహకులు తొలగించకుంటే తమ సిబ్బంది తొలగిస్తారని తెలిపారు. ఏడీఏలు బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, రమేశ్, ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.



కార్యాలయంలో మాట్లాడుతున్న ఉత్తమ్

ప్రమాదకర లైన్లను సవరించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: స్తంభాలకున్న కేబుల్ వైర్లు తొలగించాలని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం హన్మకొండ విద్యుత్‌శాఖ కార్పొరేట్ కార్యాలయం నుంచి జిల్లా విద్యుత్‌శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. ఏడాదిగా స్తంభాలపై వైర్లు తొలగించాలని కేబుల్ ఆపరేటర్లకు చెప్పినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ప్రమాదాల జరుగుతున్నాయని సంబంధిత యాజమాన్యాలకు రీఅలైన్మెంట్ చేసుకోవాలని సూచించామని, చేసుకోని పక్షంలో తొలగించాలని అధికారులను ఆదేశించారు. వినాయక మండపాలు పరిశీలించాలని, అధిక ఎత్తు ఉన్న విగ్రహాల తరలింపు ప్రాంతాల్లో ప్రమాదకర లైన్లను సవరించాలని సూచించారు. ఎస్ఈ ఉత్తమ్ జాడే, డీఈ ఖైసర్, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సమృద్ధిగా యూరియా నిల్వలు



కోటపల్లి: చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, సీపీ అంబర్ కిషోర్ ఝా

కోటపల్లి: జిల్లాలో యూరియా సమృద్ధిగా ఉందని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం మండలంలోని పార్‌పల్లి జాతీయరహదారిపై ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును సీపీ అంబర్ కిషోర్ ఝా, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ, పోలీస్, వ్యవసాయశాఖల సమన్వయంతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీం ద్వారా యూరియా అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో 2,500 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. గతేడాదితో పోలిస్తే 500 మెట్రిక్ టన్నులు ఎక్కువగా విక్రయించినట్లు పేర్కొన్నారు. యూరియా లేదనే అవాస్తవాన్ని ఎవరూ నమ్మవద్దని సూచించారు. డ్రోన్లతో పిచికారీ చేసే నానో యూరియా చెన్నూర్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. ఆయన వెంట సీఐలు దేవేందర్ రావు, బన్సీలాల్, ఎస్సై రాజేందర్, ఏఈవో రాజకుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేయర్ల పాత్ర కీలకం

మంచిర్యాలఅగ్రికల్చర్: భూ సమస్యల పరిష్కారంలో సర్వేయర్ల పాత్ర కీలకమని కలెక్టర్‌కుమార్ దీపక్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో బ్యాచ్ సర్వేయర్ల శిక్షణ కార్యక్రమానికి భూకొలతల శాఖ అధికారి శ్రీనివాస్‌తో కలిసి హాజరై మాట్లాడారు. చట్టంలోని పూర్తి వివరాలు తెలుసుకుని విధులు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని సర్వేయర్లకు సూచించారు.

ఓరియంట్ గుర్తింపు ఎన్నికలపై స్పష్టతేది?

- ఈ నెల 29న నిర్వహించేందుకు హైకోర్టు ఉత్తర్వులు జారీ

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ గుర్తింపు సంఘం ఎన్నికలపై నీలినీడలు వీడడం లేదు. హైకోర్టు ఉత్తర్వులిచ్చినా కార్మికశాఖ ఏదో ఓ కారణం చూపుతూ తప్పించుకునే ప్రయత్నం చేస్తోంది. ఈనెల 19న నిర్వహించాలని హైకోర్టు ఉత్తర్వులివ్వగా షెడ్యూల్, ఎన్నికల తేదీ ప్రకటించిన కార్మికశాఖ డీసీఎల్ 16న ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. తిరిగి ఈ నెల 18న సాయంత్రం యథావిధిగా ఎన్నికలు నిర్వహించాలని కోర్టు చెప్పినప్పటికీ కార్మికశాఖ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. దీంతో ఎన్నికలు నిర్వహించలేదని కోర్టు దృష్టికి కార్మిక సంఘాలు మంగళవారం తీసుకువెళ్లడంతో ఈనెల 29న నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు కార్మిక సంఘాల నాయకులు చెబుతుండగా, ఏ తేదీన నిర్వహిస్తారు? షెడ్యూల్ ఏమిటి? అనే దానిపై ఇంకా కార్మికశాఖ నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. దీంతో కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్మికశాఖ కోర్టు ఆదేశాలు బేఖాతరు చేస్తూ కేవలం 257మంది ఓటర్లకు ఎన్నికలు నిర్వహించకుండా నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గుతోందని ఆరోపిస్తున్నారు. ఇటు న్యాయస్థానాల విలువలు దిగజారేలా ప్రవర్తిస్తూ తమ శాఖ పరువు కూడా తీసుకుంటోందని విమర్శలు గుప్పిస్తున్నారు. ఈసారైన గడువులోపు ఎన్నికలు నిర్వహిస్తారా? లేక కార్మికశాఖ అధికారులు ఒత్తిళ్లకు తలొగ్గి మళ్లీ ఏవైనా కారణాలు వెతుకుతారా? అనే అనుమానాలు కార్మికుల్లో వ్యక్తమవుతున్నాయి.

టీఎల్‌ఎం మేళా సందర్శన

కోటపల్లి: స్థానిక మోడల్‌స్కూల్‌లో ఏర్పాటు చేసిన మండలస్థాయి టీఎల్‌ఎం మేళాను జిల్లా విద్యాధికారి యాదయ్య మంగళవారం ప్రారంభించారు. మేళాలో ప్రదర్శించిన పరికరాలు విద్యార్థులను ఎంతోగానో ఆకర్షించాయి. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఖాకీ’లతో రెస్క్యూ టీమ్



ఎస్డీఆర్‌ఎఫ్ టీమ్‌తో కలెక్టర్ కుమార్‌దీపక్, డీసీపీ భాస్కర్ (ఫైల్)

- 90మంది కానిస్టేబుళ్లతో ఏర్పాటు
- ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో శిక్షణ
- విపత్తుల్లో రక్షణకు ఎస్డీఆర్‌ఎఫ్

మంచిర్యాలక్రైం: ఎంతటి కఠిన సవాళ్లనైనా ఎదుర్కోవడం.. అత్యంత భయంకర పరిస్థితులకు ఎదురు నిలబడి అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, వరదలు తదితర విపత్తుల సమయంలో ప్రజలను రక్షించేందుకు పోలీస్‌శాఖలో ఓ ప్రత్యేక టీమ్ సిద్ధంగా ఉంది. ఈ టీమ్‌లోని సభ్యులు తమ ప్రాణాలనూ లెక్క చేయకుండా ప్రమాదంలో చిక్కుకున్నవారిని సురక్షితంగా కాపాడుతారు. గతేడాది జరిగిన విపత్తులను దృష్టిలో ఉంచుకుని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా, కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఎగ్గడి భాస్కర్ చర్యలు చేపట్టారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ (నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) ఆధ్వర్యంలో కమిషనరేట్ పరిధిలోని ఒక్కో పోలీస్‌స్టేషన్ నుంచి మెరికల్లాంటి 90మంది కానిస్టేబుళ్లను ఎంపిక చేశారు. వారికి వారంపాటు హైదరాబాద్‌లోని నాగోల్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చి టీమ్‌ను తయారు చేశారు.

గత అనుభవాల దృష్ట్యా..

గతేడాది వరుసగా కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో అనేక మారుమూల గ్రామాలు నీట మునిగి ప్రజలు అష్టకష్టాల పాలయ్యారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్, పద్మశాలీకాలనీ, రెడ్డికాలనీ, రాళ్లపేట, రాంనగర్, ఎల్ఐసీ కాలనీలు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. నీట మునిగి ఏడాది గడిచినా బాధితులు నష్టాల నుంచి తేరుకోకముందే ఈసారి మళ్లీ అదే పరిస్థితి ఎదురైంది. సుమారు ఒక్కో కుటుంబానికి రూ.3లక్షల వరకు నష్టం జరిగింది. వీరికి అప్పటి ప్రభుత్వం కూడా ఎలాంటి సాయం అందించలేదు. ఎప్పుడు వర్షాకాలం వచ్చినా జిల్లా ప్రజల్లో వణుకు మొదలవుతోంది. గతంలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో పాటు ఎగువనున్న సుందిళ్ల, ఎల్లంపెల్లి ప్రాజెక్ట్‌ల్లోకి భారీగా నీరు చేరడంతో బ్యాక్ వాటర్, గోదావరి ప్రవాహానికి తోడు, పలు కాలువలు, వాగుల నుంచి వచ్చే వరదలతో మంచిర్యాల పట్టణంలోని పలు కాలనీలు ముంపునకు గురయ్యాయి. బాధిత ప్రజలను కాపాడేందుకు స్థానిక పోలీసులు, మున్సిపల్ సిబ్బంది ఎంతో శ్రమించారు. ప్రస్తుతం చినుకు పడితే తమ గూడు చెదిరిపోతుందనే భావనలో ఎన్నో కుటుంబాలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నాయి. గతంలో రెండుసార్లు సంభవించిన ముంపులో భారీ నష్టాన్ని ప్రజలు చవిచూశారు.

ఎలా పని చేస్తారంటే..

రామగుండం కమిషనరేట్ పరిధిలో ఏర్పాటైన రెస్క్యూ టీమ్ కమిషనర్ పర్యవేక్షణలో పని చేస్తుంది. ప్రజలు ఎక్కడైనా ప్రమాదంలో చిక్కుకున్నారంటే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు గాని లేదా ‘డయల్ 100’కు కాల్ చేసి సమాచారం అందిస్తే వెంటనే అక్కడికి పోలీస్ రెస్క్యూ టీమ్ చేరుకుంటుంది. సాంకేతిక పరిజ్ఞానం, అత్యాధునిక పరికరాల ఆధారంగా ప్రమాదంలో ఉన్న వారిని టీమ్ సభ్యులు ప్రాణాలతో కాపాడేందుకు ప్రయత్నిస్తారు. ఎక్కడైనా రాకపోకలు నిలిచిపోయే విధంగా చెట్లు పడిపోయినా, రోడ్లు, బ్రిడ్జీలు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయినా, వరదలతో కాలనీల్లోకి నీరు చేరి ప్రజలు జల దిగ్బంధంలో చిక్కుకుపోయినా వారిని కాపాడుతారు. వివిధ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఈ రెస్క్యూ టీమ్ సభ్యులు తమ ప్రాణాలనూ లెక్క చేయకుండా ప్రజలను రక్షిస్తారు. కమిషనరేట్ పరిధిలో 30మంది టీమ్‌తో కూడిన మూడు టీమ్‌లు 24గంటలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.

ప్రజల రక్షణే ప్రధాన లక్ష్యం

ప్రజలను కాపాడేందుకు ప్రత్యేక రెస్క్యూ టీమ్‌ను ఏర్పాటు చేశాం. మెరికల్లాంటి కానిస్టేబుళ్లను ఎంపిక చేసి కఠోర శిక్షణ ఇప్పించాం. వరదలు, ప్రయాణాల్లో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నవారు ‘డయల్ 100’కు కాల్ చేస్తే చాలు స్థానిక పోలీసులు గాని రెస్క్యూ టీమ్ సభ్యులు గాని వెంటనే స్పందించి రక్షణ కల్పిస్తారు. విపత్తులు సంభవించినప్పుడు అధైర్యపడవద్దు. వానాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడడమే లక్ష్యంగా ఫ్లడ్ రెస్క్యూ టీమ్‌ను ఏర్పాటు చేశాం.

– ఎగ్గడి భాస్కర్, మంచిర్యాల డీసీపీ

డ్రోన్‌తో గ్రామీణ యువతకు ఉపాధి

దండేపల్లి/లక్సెట్టిపేట/మంచిర్యాలఅగ్రికల్చర్: ఎరువుల పిచికారీకి అందుబాటులోకి వచ్చిన డ్రోన్ టెక్నాలజీ గ్రామీణ యువతకు ఉపాధినిస్తోందని డీఈవో ఛత్రునాయక్ తెలిపారు. మంగళవారం ఆయన దండేపల్లి మండలం ముత్యంపేట రైతువేదికలో నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ముత్యంపేట, లక్సెట్టిపేట మండల కేంద్రంలో ఫెర్టిలైజర్ షాపులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూరియా 2552.157 మెట్రిక్ టన్నులు, డీఏపీ 588.5, ఎంవోపీ 862.55, కాంప్లెక్స్ 4342.175, ఎస్ఎస్‌పీ 451.3 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అవసరం మేరకే యూరియా వినియోగించాలని సూచించారు. ఏడీఏలు అనిత, గోపి, వ్యవసాయాధికారులు అంజిత్‌కుమార్, శ్రీకాంత్, ఏఈవోలు నరేశ్, సుజన్య, మౌనిక, శ్రీకన్య పాల్గొన్నారు.



లక్సెట్టిపేట: ఫెర్టిలైజర్ దుకాణంలో నిల్వలు పరిశీలిస్తున్న ఛత్రునాయక్

క్లుప్తంగా

కినక వంశీయుల నవధాన్యాల పూజలు



సహపంక్తి భోజనం చేస్తున్న కినక వంశీయులు

ఇంద్రవెల్లి: మండలంలోని వాల్గొండలో మంగళవారం కినక వంశీయులు నవధాన్యాల (నొవ్వోంగ్) పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామ పటేల్ ఇంట్లో ప్రత్యేక పూజల అనంతరం నవధాన్యాలతో నైవేద్యం తయారు చేసి కుల దేవతకు సమర్పించారు. కినక వంశీయులంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో కినక వంశీయులు కినక లచ్చు పటేల్, జుగాదిరావ్, మాన్కు పటేల్, దేవ్‌రావ్ కటోడ, సూర్యభాన్, యాదోరావ్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ 39 గేట్ల ఎత్తివేత

మామడ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి మంగళవారం 2.75 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగింది. అధికారులు ప్రాజెక్ట్ 39 గేట్లను ఎత్తి 3.25 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1089 అడుగుల (73.37 టీఎంసీలు) నీరు నిలకడగా ఉంది. ప్రాజెక్ట్ దిగువన గోదావరినది పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పశువులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు, రైతులు గోదావరిని దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

నెన్నెల: కుమ్మరివాగు నుంచి బెల్లంపల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడి చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. డ్రైవర్‌తో పాటు ఓనర్ గోలెం తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముగ్గురు పంచాయతీ కార్యదర్శుల తొలగింపు

- మరొకరికి చార్జ్‌మెమో

వేమనపల్లి: మండలంలోని ముగ్గురు పంచాయతీ కార్యదర్శులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ ఫేక్ అటెండెన్స్ పంపించిన కారణంగా ప్రభుత్వం వారిని విధుల్లో నుంచి తొలగిస్తున్నట్లు డీపీవో కార్యాలయం నుంచి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సుంపుటం కార్యదర్శి వెంకటి, దస్నాపూర్ కార్యదర్శి రజిత, చామనపల్లి కార్యదర్శి యాదగిరిని విధుల నుంచి తొలగించగా ముల్కలపేట కార్యదర్శి సురేష్‌కు చార్జ్‌మెమో, ఎంపీడీవో కుమారస్వామికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సమయపాలన పాటించకుండా పాత ఫొటోను తీసి క్షేత్ర స్థాయిలో విధుల్లో ఉన్నట్లు ఫేక్ అటెండెన్స్ పంపించడంతో ముగ్గురిపై వేటు పడింది.

వర్షానికి కూలిన ఇళ్లు



దస్తురాబాద్‌లో కూలిన ఇల్లు

దస్తురాబాద్: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం మండలంలోని బుట్టాపూర్ గ్రామానికి చెందిన గుండ లక్ష్మి, మండల కేంద్రంలోని గంప భారతకు చెందిన ఇల్లు కూలిపోయాయి. కూలిన ఇళ్లను తహసీల్దార్ విశ్వంబర్, పంచాయతీ కార్యదర్శి పరిశీలించారు.

సాత్నాల: ఇటీవల కురుస్తున్న వర్షాలకు భోరజ్ మండలంలోని ఆకోలి గ్రామానికి చెందిన ఆత్రం రంగనాథ్ ఇల్లు కూలింది. మంగళవారం అకస్మాత్తుగా గోడలు కూలిపోవడంతో ఇంట్లో ఉన్న నలుగురు కుటుంబ సభ్యులు భయంతో బయటకు పరుగులు తీయడంతో ప్రమాదం తప్పింది. ఇల్లు పూర్తిగా ధ్వంసం కావడంతో ఆ కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. కూలీపని చేసుకుని జీవనం సాగించే తమకు ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేదని, శాశ్వత గృహం మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ నేత వాంగ్మూలం

భీమారం: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన ఫోన్‌ట్యాపింగ్‌లో భీమారం మండల కాంగ్రెస్ నేత పొడేటి రవి ఇటీవల సిట్ విచారణకు హాజరైనట్లు ఆలస్యంగా తెలిసింది. పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ నుంచి పిలుపు వచ్చిన మాట వాస్తవమేనని రవి 'సాక్షి'కి మంగళవారం తెలిపారు. ఈ మేరకు విచారణలో శాసనసభకు జరిగిన ఎన్నికల్లో చెన్నూర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నగదు తరలిస్తుండగా మందమర్రి ఏరియాలో ఎన్నికల అధికారులు పట్టుకున్నారు కదా అని, అప్పట్లో ఇబ్బందికరంగా ఏమైనా ఫోన్లు వచ్చాయా అని సిట్ అధికారులు ప్రశ్నించినట్లు తెలిపారు. తాను కాంగ్రెస్‌పార్టీకి విధేయునిగా ఉన్నందునే అప్పటి ప్రభుత్వం తనఫోన్ ట్యాప్ చేయించిందని, ఈ విషయం అధికారులు తనకు చెప్పేంత వరకు తెలియదని అన్నారు.

వరదనీటితో పంటలకు ముప్పు

- జాగ్రత్తలు పాటించకుంటే నష్టం
- రాజశేఖర్, ఆదిలాబాద్ కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త



భీమిని మండలంలో పత్తి పంటలో వరద నీరు



రాజశేఖర్, శాస్త్రవేత్త

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 16.20 లక్షల ఎకరాల్లో వివిధ రకాలు పంటలు సాగయ్యాయి. ఇందులో అధికశాతం రైతులు పత్తి సాగు చేశారు. ఉమ్మడి జిల్లాలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునుగుతున్నాయి. పత్తి, వరి, సోయా, కంది పంటలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. కొన్ని ప్రాంతాల్లో వరద నీటితో పంటల్లో మట్టి, ఇసుక మేటలు వేసి తీరని నష్టాన్ని మిగులుస్తున్నాయి. దీంతో చేనులోంచి నీటిని పంపించేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మరోవైపు నీటి పదను ఎక్కువై మొక్కలు జాలువారి పోతున్నాయి. పంటకు వేరుకుళ్లు, ఎండు తెగులు, ఆకుమచ్చ, కాండం కుళ్లు తెగుళ్లు సోకడంతో ఆకులు పసుపు వర్ణం, ఎర్రబారిపోవడంతో పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల రైతులు ఈ సమయంలో అప్రమత్తంగా ఉండి సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలని, పంటల్లో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని ఆదిలాబాద్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్ సూచిస్తున్నారు.

పత్తి పంటలో..

- పంట చేలల్లో కాల్వలు తీసి నీటిని బయటకు పంపించాలి. వీలైనంత త్వరగా అంతర కృషి చేయాలి. దీనివల్ల భూమిలో తేమ తగ్గి వేర్లకు గాలి, పోషకాలు అందడంతో మొక్కలు త్వరగా సాధారణ స్థితికి వస్తాయి. నీరు బయటకు పంపిన తర్వాత ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌ను మొక్కకు 5 నుంచి 6 సెంటీమీటర్ల దూరంలో గుంతలు తీసి వేయాలి. లేదా అంతరకృషి చేయాలి.
- పొలంలో తేమ అధికంగా ఉన్నప్పుడు వేర్లు పోషకాలు, నీటిని తీసుకోలేక ఆకులు లేత ఆకుపచ్చ రంగులోకి మారుతాయి. దీనివల్ల మొక్కల పెరుగుదల తగ్గుతుంది. కాబట్టి 20 గ్రాముల యూరియా లేదా పది గ్రాముల 20-20 లీటరు నీటిలో కలిపి ఐదురోజుల వ్యవధిలో రెండు మూడు సార్లు పిచికారీ చేస్తే మొక్కలు త్వరగా కోలుకుంటాయి.

భూమి, వాతావరణంలో తేమ అధికంగా ఉన్నప్పుడు పత్తిని ఆకుపచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. దీని నివారణకు పది లీటర్ల నీటిలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30 గ్రాములు, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్‌ను కలిపి పిచికారీ చేయాలి.

- భూమిలో అధిక తేమ ఉన్నప్పుడు వేరుకుళ్లు తెగులు ఆశించి మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు లేదా కార్బండిజమ్ రెండు గ్రాములు లీటర్ నీటిలో కలిపి ద్రావణాన్ని తెగులు సోకిన మొక్క మొదళ్లలో పోయాలి.

ఆకుముడుత పురుగు

ఈ పురుగు ఆకుముడుతలో ఉండి పత్రహరితాన్ని హరించడంతో ఆకులు తెల్లబడుతాయి. దీని నివారణకు పిలక దశలో చేనుకు అడ్డంగా తాడుతో 2 నుంచి 3 సార్లు లాగితే పురుగులు కిందపడిపోతాయి. ఆతర్వాత క్లోరిపైరీఫాస్ 2.5 మిల్లీలీటర్లు లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లేదా క్లోరాన్ నిలిప్రోల్ 0.4 మిల్లీలీటర్లు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 20 డబ్ల్యూడీజీ 0.25 గ్రాములు లేదా 48 ఎస్‌సీ 0.1 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 జి గుళికలు ఎకరాకు ఎనిమిది కిలోల చొప్పున వేయాలి.

వరి పంటలో..

వరి సాగు చేసిన రైతులు ఇప్పటికే నాట్లు వేసినట్లయితే పంటలో ఎక్కువ మోతాదులో నీరు ఉండకుండా చూడాలి. ముంపు పాలైన వరి పొలాల్లో తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉంది. వీలైనంత త్వరగా నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

తాటాకు తెగులు

హిస్పాపిల్లా పెద్దపురుగులు ఆకులోని పత్రహరితాన్ని గోకి తినడం వల్ల తెల్లటి చారలు ఏర్పడి ఆకులు ఎండిపోతాయి. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లేదా క్లోరోపైరీఫాస్ 2.5 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పొడతెగులు

ఆకులపై పాము పొడ మచ్చలుగా ఏర్పడి మొక్కలు పూర్తిగా ఎండిపోతాయి. దీని నివారణకు హెక్సాకొనజోల్ రెండు మిల్లీలీటర్లు లేదా వాలిడా మైసిన్ రెండు మిల్లీలీటర్లు లేదా వాలిడా మైసిన్ రెండు మిల్లీలీటర్లు లేదా ప్రోపికొనజోల్ 1 మిల్లీలీటర్ లేదా ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్+ టెబ్యుకొనజోల్ 75 డబ్ల్యూజీ 0.4 గ్రాములు లీటర్ నీటిలో కలిపి 15 రోజులకు ఒకసారి చొప్పున రెండు సార్లు పిచికారీ చేయాలి.

అగ్గితెగులు

అగ్గితెగులు నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాముల లేదా ఐసోప్రోదయేలేన్ 1.5 మిల్లీలీటర్లు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

లారీ బోల్తాపడి డ్రైవర్ మృతి



డ్రైవర్ అనిల్ మృతదేహం

నేరడిగొండ: బ్రిడ్జి పైనుంచి లారీ కిందపడిన ఘటనలో డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఇచ్చోడ సీఐ రాజు తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఐచర్ కంటైనర్ నేరడిగొండ మండలంలోని కుప్టి వంతెన వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అనువతే అనిల్ (38) క్యాబిన్‌లోనే ఇరుక్కుని మృతి చెందాడు. మృతదేహాన్ని క్రేన్ సహాయంతో బయటకు తీశారు. అతివేగంగా, అజాగ్రత్తగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని సీఐ తెలిపారు. ఎస్సై ఇమ్రాన్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

108లో ప్రసవం



కవల పిల్లలకు జన్మనిచ్చిన ప్రతిక్ష

ఇచ్చోడ: మండలంలోని ముఖరా బి గ్రామానికి చెందిన గర్భిణి ప్రతిక్షకు మంగళవారం పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త అనిల్ 108కు సమాచారం అందించాడు. అంబులెన్సులో ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే నొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ రాకేశ్, ఈఆర్‌సీపీ డాక్టర్ కౌశిరెడ్డి సలహా మేరకు వాహనంలోనే డెలివరీ చేశారు. మొదటికాన్పులో ఇద్దరు ఆడ పిల్లలకు జన్మనిచ్చింది. తల్లీపిల్లలు క్షేమంగా ఉండటంతో వారిని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పైలట్ వినోద్, ఈఎంటీ రాకేశ్‌ను గ్రామస్తులు అభినందించారు.

నీటి ప్రవాహంతో నిలిచిన బస్సు



ప్రయాణికులను వాగు దాటిస్తున్న ఎస్సై

భీంపూర్: మండలంలోని గోమూత్రి, కరంజి గ్రామాలకు బయలుదేరిన బస్సు మంగళవారం రాత్రి అంతర్గామ వద్ద వాగు ఉప్పొంగి ప్రవహించటంతో మార్గమధ్యలో నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై పీర్‌సింగ్ నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని స్థానిక యువకులతో కలిసి తాడు సహాయంతో ప్రయాణికులను వాగు దాటించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు వాగులు, వంకలను దాటవద్దని, అత్యవసర సమయంలో పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించాలని ఎస్సై సూచించారు.

చిట్టీ డబ్బులు కాజేసిన మహిళపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: చిట్టీ డబ్బులు కాజేసిన మహిళపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని సంజయ్‌నగర్ కాలనీకి చెందిన ఓ మహిళ 20 మంది వద్ద నెలకు రూ.10 వేల చొప్పున చిట్టీ పేరిట డబ్బులు వసూలు చేసి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడంతో బాధితులు టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సదరు మహిళపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిచేసిన ఒకరిపై..

లక్సెట్టిపేట: ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఉట్నూర్ డిపోకు చెందిన డ్రైవర్ విజయేందర్‌పై దాడి చేసిన పట్టణానికి చెందిన దూడ శంకర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక అంబేడ్కర్‌చౌక్ వద్దకు వచ్చి నా బైక్‌ను ఢీకొడతావా అని బూతులు తిడుతూ కొట్టడంతో డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై..

ఇంద్రవెల్లి: గంజాయి సేవిస్తున్న ముగ్గురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఇ.సాయన్న తెలిపారు. మండలంలోని రేపల్లివార్ అశోక్, రేపల్లివార్ లక్ష్మణ్, మోరే అజయ్ ప్రతీరోజు గంజాయి సేవిస్తున్నట్లు తమకు అందిన సమాచారం మేరకు వారికి యూరీన్ కిట్ ద్వారా పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ రావడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో ముగ్గురు రిమాండ్

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని సిరికల్చర్ కార్యాలయంలో జనరేటర్ చోరీ చేసిన కేసులో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నార్నూర్ మండలానికి చెందిన అరవింద్, ఉట్నూర్ మండలం లక్కారంకు చెందిన సందీప్ జనరేటర్‌ను చోరీ చేసి ఉట్నూర్ ఐబీ ప్రాంతంలోని పాత ఇనుప సామానులు కొనుగోలు చేసే దుకాణ యజమాని అబ్రార్‌కు విక్రయించినట్లు తెలిపారు. చోరీ చేసిన ఇద్దరితో పాటు కొనుగోలు చేసిన వ్యక్తిని సైతం అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



అంతిమయాత్రలో పాల్గొన్న గ్రామస్తులు

దస్తురాబాద్: ఉజ్బెకిస్థాన్ దేశంలో గుండెపోటుతో మృతి చెందిన మండలంలోని మున్యాల గ్రామపంచాయతీలోని పెద్దూర్‌కు చెందిన సంగ సురేష్ (35) మృతదేహం మంగళవారం స్వగ్రామానికి చేరుకుంది. గత నెల 22న ఉజ్బెకిస్థాన్‌లో పనిచేస్తుండగా హఠాత్తుగా గుండెపోటు రావడంతో తోటి కార్మికులు ఆస్పత్రికి తరలించేలోగానే మృతి చెందాడు.

తప్పిన ప్రమాదం



పక్కకు ఒరిగిన ఆర్టీసీ బస్సు

లక్ష్మణచాంద: మండలంలోని పార్‌పెల్లి నుంచి నిర్మల్ వెళ్లే ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. మంగళవారం పార్‌పెల్లి నుంచి నిర్మల్ బయలుదేరిన ఆర్టీసీ బస్సు పీచర-రాచాపూర్ గ్రామాల మధ్య అకస్మాత్తుగా ఎదురుగా వాహనం రావడంతో డ్రైవర్ బస్సును నెమ్మదిగా రోడ్డు కిందకు దించాడు. లేదంటే పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లేదని ప్రయాణికులు తెలిపారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడం వల్లే ప్రమాదం తప్పిందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాగజ్‌నగర్‌టౌన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యాసంవత్సరానికి 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2025 సెప్టెంబర్ 23 లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 2026, ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కలిసి కట్టుగా కట్టారు..



రాళ్లకట్ట కడుతున్న గ్రామస్తులు

సిరికొండ: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని రిమ్మ గ్రామానికి వెళ్లే మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ప్రయాణానికి ఇబ్బందులు తలెత్తడంతో మంగళవారం రిమ్మ, తిమ్మాపూర్ గ్రామస్తులంతా కలిసి కట్టుగా కొట్టుకుపోయిన రోడ్డుతో పాటు రోడ్డు పక్కన గల రాళ్లకట్టకు ఇలా మరమ్మతులు చేశారు.

ఆర్జీయూకేటీలో ఇండక్షన్ ప్రోగ్రాం



వీసీకి పూలమొక్క ఇస్తున్న విద్యార్థిని

బాసర: బాసర ఆర్జీయూకేటీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టూడెంట్ ఆక్టివిటీ సెంటర్‌లో పీయూసీ2 పూర్తి చేసుకుని ఇంజినీరింగ్‌లో విభాగంలో చేరిన కొత్త విద్యార్థులకు మంగళవారం ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ప్రత్యేక అతిథిగా ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ సంవత్సరం నుండి ఆర్జీయూకేటీలో 2025 పాఠ్యక్రమం అములులోకి వచ్చినట్లు తెలిపారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కరికులం రూపకల్పన చేయబడిందని, అన్ని ఇంజనీరింగ్ బ్రాంచులకు సమాన ప్రాధాన్యత లభించేలా రూపొందించబడిందన్నారు. ఓఎస్డీ మాట్లాడుతూ మనం కేవలం ఉద్యోగాలు పొందడమే కాకుండా కొత్త ఉద్యోగాలను సృష్టించి దేశానికి సేవ చేయాలని లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. అసోసియేట్ డీన్స్ డాక్టర్ మహేశ్, డాక్టర్ వీ.చంద్రశేఖర్‌రావు, సీఎస్సీ విభాగాధిపతి డాక్టర్ వెంకట్రామన్, తదితరులు పాల్గొన్నారు.

అక్కాచెల్లెళ్లకు పీహెచ్‌డీ పట్టాలు



పట్టాలతో భాగ్యలక్ష్మి, ఉదయరాణి

బోథ్: ఉస్మానియా విశ్వవిద్యాలయం మంగళవారం నిర్వహించిన స్నాతకోత్సవంలో మండలంలోని సొనాలకు చెందిన ఇద్దరు అక్కాచెల్లెళ్లు ఒకే వేదికపై పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు. ఉస్మానియా యూనివర్శిటీలో ఇర్ల భాగ్యలక్ష్మి తెలుగు సాహిత్యంలో పరిశోధన చేయగా ఆమె చెల్లెలు ఉదయరాణి చరిత్రలో పరిశోధన చేసింది. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఇస్రో చైర్మన్ నారాయణ, వైస్ ఛాన్సలర్ ఎం.కుమార్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టాలు అందుకున్నారు. విద్యారంగంలో తమదైన ముద్ర వేసుకుంటూ, ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఈ అక్కాచెల్లెళ్లు పలువురికి ఆదర్శంగా నిలిచారు. నిరంతర కృషి, పట్టుదల ఉంటే ఎంతటి ఉన్నతమైన లక్ష్యాలనైనా సాధించవచ్చని వారు పేర్కొంటున్నారు.

మెడికల్ బోర్డులో లోపాలు సరిచేయాలి



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న జీఎల్‌బీకేఎస్ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణి మెడికల్ బోర్డులో లోపాలను సరిచేయాలని కోరుతూ జీఎల్‌బీకేఎస్ గౌరవ అధ్యక్షుడు సాదినేని వెంకటేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి జీ.సీతారామయ్య మంగళవారం హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ ఎన్.బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల మెడికల్ బోర్డులో అర్హులైన చాలామందిని అన్‌ఫిట్ చేయాల్సి ఉండగా ఫిట్ ఇచ్చి అన్యాయం చేశారన్నారు. చాలామంది కార్మికులు జబ్బులతో బాధపడుతున్నారన్నారు. తిరిగి మెడికల్ బోర్డు నిర్వహించి ఫిట్ ఇచ్చిన వారిని తిరిగి స్క్రీనింగ్ చేయాలని కోరారు. అంతే కాకుండా పెండింగ్‌లో ఉన్న డిపెండెంట్ల ఉద్యోగాలను త్వరితగతిన సెటిల్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాస్, జీ.అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

వాగు దాటి..కుమారుడికి వైద్యం అందించి



వాగు దాటుతున్న మెస్రం గంగారాం

ఇంద్రవెల్లి: మండలంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వాగు ఉప్పొంగడంతో హర్కపూర్ అంద్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడ ఏ, మామిడిగూడ జీ గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు స్తంభించి పోయాయి. మంగళవారం వరద నీరు తగ్గడంతో మామిడిగూడ జీ గ్రామ పటేల్ మెస్రం గంగారాం జ్వరంతో బాధపడుతున్న తమ కుమారుడు గురుప్రసాద్‌ను భుజంపై ఎక్కించుకుని ప్రమాదకర పరిస్థితిలో వాగు దాటి ఇంద్రవెల్లి ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాడు. వాగు వద్ద కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వం రూ.3.5 కోట్ల నిధులు మంజూరు చేసినప్పటికీ పనులు ప్రారంభించకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని గ్రామస్తులు వాపోయారు. ఏటా వర్షాకాలంలో తిప్పలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి వాగుపై కల్వర్టు నిర్మించాలని కోరుతున్నారు.


కలశయాత్రకు ఘన స్వాగతం



మాజీ సైనికాధికారిని సన్మానిస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: 1962లో భారత్, చైనా దేశాల మధ్య జరిగిన యుద్ధంలో 114 మంది యాదవ జవాన్లు వీరమరణం పొందారని బిహార్ రాష్ట్ర మాజీ సైనికాధికారి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. వారి స్మారకార్థం కిరణ్‌కుమార్ చేపట్టిన రేజాంగుల రాజ్ కలశయాత్ర మంగళవారం మందమర్రికి చేరుకుంది. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బండి సదానందం ఆధ్వర్యంలో ఘన స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా ఇందూ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 122 రోజుల క్రితం ప్రారంభమైన యాత్ర ఇప్పటికే 28 రాష్ట్రాలు తిరిగామన్నారు. నవంబర్ 19న ఢిల్లీలో ముగియనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మల్లెత్తుల నరేష్ యాదవ్, ఆర్.లక్ష్మణ్ యాదవ్, యశ్వంత్‌రాజ్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

గంగమ్మ ఒడిలో ఉమామహేశ్వరుడు



నాడు ఉమా మహేశ్వరుడి ఆలయం



నేడు గోదావరినదిలో మునిగిన ఆలయం

లోకేశ్వరం: ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి ఉధృతి పెరిగి మండలంలోని పంచగుడి సమీపంలో ఉన్న నందిపేట్ మండలం ఉమ్మెడ ఉమామహేశ్వర ఆలయం మంగళవారం నీట మునిగింది. ఎస్సారెస్పీలో బ్యాక్ వాటర్ చేరడంతో ఆలయం పూర్తిగా నీట మునిగింది. వచ్చే జనవరి వరకు మందిరం ముంపులోనే ఉండే అవకాశం ఉంది. ఏటా శివరాత్రికి ఉమ్మెడ వీడీసీ, ఆలయ కమిటీ సభ్యులు ఇక్కడ ఉత్సవాలు నిర్వహిస్తారు.

ముసురు మురిపెం..



ఇంటిబాట పట్టిన చిన్నారులు



నెత్తిపై సంచి వేసుకొని ఇంటికి వెళ్తున్న చిన్నారులు

ఇటీవల భారీ వర్షాలు కురుస్తుండడంతో నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ బుధవారం పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. దీంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. రేపు సెలవు ఇచ్చారంటూ చిరునవ్వులు చిందిస్తూ మంగళవారం ఇంటిబాట పట్టారు. ఆ దృశ్యాలను 'సాక్షి' కెమెరాలో క్లిక్ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్